

వైభవంగా గుంటి సుబ్రహ్మణ్యేశ్వరుడి తిరునాళ్ల



గార్లదిన్నె, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : భక్తుల ఆరాధ్యదైవం కోరిన కోర్కెలు తీర్చుతూ భక్తుల కల్పతరువుగా విరాజిల్లుతున్న కోటంక గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మండల పరిధిలోని కోటంక గ్రామ సమీపంలోని కొండల మధ్య వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తిరునాళ్లలో భాగంగా మాఘమాస రెండో ఆదివారం ఆలయ ప్రధాన అర్చకులు రామాచార్యులు ఆదివారం తెల్లవారుజామున స్వామివారికి ఏకవార రుద్రాభిషేకం తదితర పూజా కార్యక్రమాలు నిర్వ హించారు. స్వామివారిని దర్శనానికి జిల్లా నలుమూలలు నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మొక్కులు నెరవేరిన భక్తులు వివిధ రూపా ల్లో స్వామికి కానుకలు సమర్పించారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, మాజీ జడ్పీటీసీలు విశాలాక్షి, అమ్మలదిన్నె శాలిని, డీసీ చైర్మన్ శేఖర్, సర్పంచు మేడాపురం లక్ష్మితో పాటు పలువురు నాయకులు స్వామిని దర్శించుకున్నారు. దేవదా యశాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేని ఘనంగా సత్కరించారు. శింగనమల సర్కిల్ సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే రెండో ఆదివారం పురస్కరించుకుని అనంతపురం మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్, వైసీపీ నా యకుడు నారాయణరెడ్డి ఆధ్వర్యంలో అన్నదానవం నిర్వహించారు.

ప్రత్యేక అలంకరణలో గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ



అశ్వత్థానికి పోటెత్తిన భక్తులు

ఘనంగా నారాయణస్వామికి పూజలు



అలంకరణలో అశ్వత్థ నారాయణస్వామి

పెద్దపప్పూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అశ్వత్థ నారాయణస్వామి తిరునాళ్ల రెండో ఆదివారం కూడా ఘనంగా జరిగింది. మాఘమాసం సందర్భంగా అశ్వత్థ నారాయణస్వామికి చక్రస్థాపన భీమలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. తిరునాళ్లకు వచ్చిన భక్తులు ఉత్తర దక్షిణం ఏటిద్వారా పుణ్యస్నానాలు చేశారు. స్వామివారి దర్శనానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేకపూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందిలేకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.





క్యూలైన్‌లో భక్తులు.. ప్రత్యేక అలంకరణలో శ్రీ చక్ర భీమలింగేశ్వరుడు..

నేడు నులిపురుగుల నివారణ దినం..

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి ఏర్పాట్లు

నులిపేద్దాం

పిల్లల ఆరోగ్యాన్ని సంరక్షించుకుందాం



నులిపురుగుల నివారణపోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టరు తదితరులు (ఫైల్)

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పిల్లల ఆరోగ్యానికి గొడ్డలి పెట్టుగా మారిన నులి పురుగుల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. 1నుంచి 19ఏళ్ల వయసు పిల్లలందరు ఈనులిపురుగుల బారినపడి అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని వైద్యవర్గాలు చెబుతున్నాయి. శరీరంలో నులిపురుగులు ఉండటం వల్ల రక్తహీనత ఏర్పడుతుంది. అలాగే మానసిక, శారీరక అభివృద్ధిని దెబ్బతీస్తాయని వైద్యులు చెబుతున్నారు. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పిల్లల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్న నులిపురుగులను నివారణ కోసం ప్రతిఏటా ఫిబ్రవరి 10న జాతీయ నులిపురుగుల నివారణ దినాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తోంది. ఈనేపథ్యంలోనే సోమవారం ఆల్బెండజోల్ మాత్రలుపంపిణీకి జిల్లా వైద్యశాఖ ఏర్పాట్లు చేపట్టింది.


నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు బాగా పనిచేస్తాయి. అందుకే ప్రభుత్వమే వైద్యశాఖ పర్యవేక్షణలో ఈమాత్రలను 1 సంవత్సరం నుంచి 19ఏళ్ల లోపు వయసు పిల్లలందరికీ పంపిణీ చేస్తోంది. అయితే రెండేళ్లలోపు పిల్లలకు ఈమాత్రలను నీళ్లలో కలిపి తాపించాలి, రెండేళ్ల వయసుపైబడిన వారందరికి 400 ఎంజీ మాత్రను నమిలి మింగించాల్సి ఉంటుందని ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టరు నారాయణస్వామి అన్నారు. ఈమాత్రలు మింగించినపుడు కొందరికి వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి వస్తే ఆ పిల్లల్లో ఎక్కువగా నులిపురుగుల ప్రభావం ఉన్నట్లు అర్థం చేసుకోవాలని, అలాంటపుడు ఎవరు భయపడకుండా దగ్గరలో ఉన్న పీహెచ్‌సీల వద్దకు ఆపిల్లలను తీసి కెళ్లి పర్యవేక్షించాలని ఆయన వైద్యసిబ్బందికి సూచించారు. ఈఅల్బెండజోల్‌మాత్రలు తీసుకోవడం వల్ల పిల్లలలో రక్తహీనత తగ్గి, పోషకాహారం శరీరంలో అన్ని భాగాలకు అంది ఆరోగ్యంగా ఉంటారని వైద్యులు పేర్కొన్నారు.

● నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు

● 6,08,529 మంది పిల్లల గుర్తింపు

జిల్లాలో సోమవారం నులిపురుగుల మాత్రల పంపిణీకి జిల్లావైద్యశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లావ్యాప్తంగా ఏడాదినుంచి 19ఏళ్ల లోపు పిల్లలు 6,08,529 మంది ఉన్నట్లు గుర్తించారు. వీరందరికి నులిపురుగు నివారణకు సంబంధించిన ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని వైద్యశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకుగాను అంగన్‌వాడీలు, పాఠశాలలు, కళాశాలలో పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే మాత్రల పంపిణీపై ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లతోపాటు ఇతర వైద్యసిబ్బందికి అవగాహన కల్పించారు. మొత్తం మీద జిల్లా వ్యాప్తంగా 2032 అంగన్‌వాడీ కేంద్రాలు, 4916 పాఠశాలలు, కళాశాలలో మాత్రలు పంపిణీ చేసేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి పీహెచ్‌సీ, అర్బన్ పీహెచ్‌సీ, ఉప ఆరోగ్యకేంద్రాలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల పరిధిలో మాత్రల పంపిణీ కొనసాగిస్తున్నారు. ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ సజావుగా సాగడానికి, పర్యవేక్షణకు ప్రతి డివిజన్‌కు ఇద్దరు డాక్టర్లను నియమించారు.





నులిపురుగుల వ్యాప్తి ఇలా

కడుపులో నులిపురుగులు ఉంటే పిల్లలు అనారోగ్యానికి గురవుతారు. తీసుకునే ఆహారం, తాగేనీరు, మురికి చేతులు ద్వారా లార్వా చర్మం లోపలికి చొచ్చుకొని పోవడం వల్ల నులిపురుగుల సంక్రమణ జరుగుతుందని డాక్టరు చెబుతున్నారు. ఈ నులిపురుగులు వృద్ధి చెందితే పిల్లల్లో రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, బలహీనంగా తయారు కావడం, వ్యాధి నిరోదక శక్తి కోల్పోవడం, తరచూ కడుపునొప్పితో బాధపడటం, వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడుతూ బరువు తగ్గుతారని వైద్యవర్గాలు చెబుతున్నాయి.

● పిల్లలందరికీ వేయించండి: డాక్టర్ ఈబీదేవి, డీఎంహెచ్ఓ

నులిపురుగుల నివారణకు సంబంధించి పిల్లలకు సోమవారం ఉచితంగా మాత్రలు పంపిణీ చేస్తున్నాం. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు పక్కాగా చేపట్టాం. జిల్లా వ్యాప్తంగా 1 సంవత్సరం నుంచి 19ఏళ్లలోపు పిల్లలు 6,08,529 మంది ఉన్నారు. వీరందరికీ మాత్రలు అందజేస్తాం. ఇదిపిల్లల ఆరోగ్య సంరక్షణకు ఎంతో మంచి కార్యక్రమం, అన్నిశాఖల అధికారులు, విద్యాశాఖ అధికారులు. ఉపాధ్యాయులు పూర్తిగా బాధ్యత తీసుకొని పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు ఇప్పించి, నులిపురుగుల నివారణకు సహకరించాలి.



రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్

విజేత జిల్లా జట్టు



విజేతగా నిలిచిన అనంతపురం జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ క్రీడా పోటీల విజేతగా అనంతపురం జట్టు నిలిచింది. గత మూడు రోజులుగా స్థానిక నీలం సంజీవరెడ్డి పీటీసీ స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ క్రీడా పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన 300 మీటర్లు, 400 మీటర్లు వాక్, 3కె రన్, 5కె రన్, జావెలిన్ త్రో, షార్ట్‌పుట్, డిస్కస్‌త్రో విభాగాలలో అటు పురుషులు, ఇటు మహిళల విభాగంలో జిల్లా జట్టు చాంపియన్‌షిప్‌గా నిలిచింది. కర్నూలు ద్వితీయ స్థానం, గుంటూరు తృతీయ స్థానం, నెల్లూరు నాలుగో స్థానంలో నిలిచాయి. రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ (మా) అధ్యక్షుడు లక్ష్మీపతిరాజు, కార్యదర్శి రాంప్రసాద్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్కేయూ మాజీ రిజిస్ట్రార్ సుధాకర్‌బాబు, మా కార్యనిర్వాహక కార్యదర్శి సుధాకర్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సికిందర్, కార్యదర్శి లోకనాథ్, సభ్యులు భాస్కర్, రమేష్, కృష్ణయ్య, నందిత, మంజుల పాల్గొన్నారు.

హోరాహోరీగా హాకీ పోటీలు

రాష్ట్ర పోటీల్లో ఫైనల్‌కు చేరిన కడప, అనంతపురం జట్లు

7

మోస్ట్ వాంటెడ్ ధార్ గ్యాంగ్..

60 మంది సభ్యులు..
అందరిపైనా పదుల సంఖ్యలో కేసులు

నేడు మద్యం దుకాణాల లాటరీ

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని జడ్పీ సమావేశపు హాలులో సోమవారం ఉదయం 9 గంటలకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో గీత కులస్థులకు మద్యం దుకాణాల లాటరీ తీస్తామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతపురం జిల్లాలోని 14 మద్యం దుకాణాలకు గీత కులస్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించామని అన్నారు. మొత్తం 11 మద్యం షాపులకు 63 మంది దరఖాస్తులు వచ్చాయన్నారు. అనంతపురం నగర పాలక సంస్థ పరిధిలో 11 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. గుంతకల్లులో 18, తాడిపత్రి-1, రాయదుర్గం-1, కంబదూరు-1, గుమ్మగట్ట-1, గుత్తి-11, గుంతకల్లు రూరల్-4, బెళుగుప్ప-10, రాప్తాడు-2, కళ్యాణదుర్గం-3 దరఖాస్తులు వచ్చాయన్నారు. డి. హిరేహాల్, రాయదుర్గం రూరల్ మండలం, గుత్తి రూరల్ మండలాల్లో దరఖాస్తులు దాఖలు కాలేదన్నారు.



కాలు విరిగిందని వస్తే ప్రాణాలే పోయాయి

- చికిత్సపొందుతూ ప్రమాద బాధితుడి మృతి
- కావేటి ఆస్పత్రి ఎదుట బాధితుల ఆందోళన
- పోలీసులకు ఫిర్యాదు



ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న మృతుడి భార్య కవిత, బంధువులు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యం నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యానికి మరొకరు బలైపోయారు. ప్రమాదంలో కాలు విరిగిందని వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రికి వెళితే, అక్కడ ఏకంగా ప్రాణాలే పోయాయి. డాక్టరు గాని డాక్టరు ఆపరేషన్ చేయడం వల్లే తమకు అన్యాయం జరిగిందని బాధితులు ఆరోపిస్తున్నారు. ఆపరేషన్‌కు ఆరోగ్యశ్రీ నుంచి అప్రూవల్ రావడం ఆలస్యం కావడం వల్లే ఇలా జరిగిందని ఆస్పత్రి యాజమాన్యం అంటోంది. ఈ ఘటన ఆదివారం జిల్లాకేంద్రంలోని కావేటీ మల్టీసూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో జరిగింది. బాధితులు, ఆస్పత్రి యాజమాన్యం తెలిపిన మేరకు.. నగరంలోని ఎస్‌బీఐ కాలనీకి చెందిన బ్రహ్మాచారి(31) ఈనెల ఆరో తేదీ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈప్రమాదంలో ఆయన కుడికాలు విరిగింది. వెంటనే కుటుంబ సభ్యులు జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. అక్కడ చేరిన తర్వాత డాక్టర్లు పట్టించుకోవడం లేదని, డబ్బు ఖర్చు అయిన పర్వాలేదని పక్కనే ఉన్న కావేటి మల్టీస్పెషాలిటీ ఆస్పత్రికి అదేరోజు రాత్రి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన డాక్టర్లు ఆరోగ్యశ్రీ ద్వారా మరుసటి రోజు ఆపరేషన్ చేస్తామని చెప్పి మందులు ఇచ్చారు. అయితే ఏడు, ఎనిమిది తేదీల్లో ఆపరేషన్ చేయలేదు. ఇదేమని అడిగితే ఆరోగ్యశ్రీ నుంచి ఆమోదం రాలేదని చెప్పారు. శనివారం రాత్రి అడిగితే ఆదివారం చేస్తామని చెప్పడంతో మిన్నకుండిపోయారు. అయితే ఏమి జరిగిందో కానీ ఆదివారం మధ్యాహ్నం బ్రహ్మాచారి చనిపోయాడు. ఈ విషయాన్ని ఆస్పత్రి యాజమాన్యం బాధితులకు సాయంత్రం తెలిపింది. ఆపరేషన్ చేస్తామని చెప్పారు, ఇప్పుడు చనిపోయాడని చెబుతున్నారే.! ఇదెలా సంభవం అంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టరుగానిడాక్టరు మత్తుమందు ఇచ్చి ఆపరేషన్ చేయడం వల్లనే చనిపోయాడంటూ భార్య కవితతోపాటు బంధువులు ఆస్పత్రి యాజమాన్యంతో వాగ్వాదానికి దిగారు. ఆస్పత్రి ఎదుట నిరసనకు దిగారు. 11నెలల చంటి బిడ్డతో భార్య కవిత నిరసనలో కూర్చొని రోదించడం కలచివేసింది.



బ్రహ్మాచారి మృతదేహం

ఆపరేషన్ చేయలేదు..

అయితే యాజమాన్యం మాత్రం ఎలాంటి ఆపరేషన్ చేయలేదని, ఆరోగ్యశ్రీ ఆమోదం కోసం చూస్తూ వస్తున్నామని, ఇంతలోనే ఇన్‌ఫెక్షన్ అయి చనియాడని చెబుతున్నారు. అలాంటప్పుడు తమతో ముందుగానే ఆస్పత్రికని రూ.13వేలు, ఆరోగ్యశ్రీకార్డుకని రూ.4,500 ఎందుకు వసూలు చేశారో ఆస్పత్రి యాజమాన్యం చెప్పాలని మృతుడి భార్య ఆగ్రహం వ్యక్తం చేశారు. టూటౌన్ పోలీసులు అక్కడకు చేరుకొని బాధితులతో ఫిర్యాదు తీసుకొని కేసు నమోదు చేసుకున్నారు. ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ డాక్టరు నారాయణస్వామి ఆస్పత్రివద్దకు వచ్చి జరిగిన ఘటనపై విచారించి వివరాలు డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీదేవికి తెలియజేశారు.

పెనుకొండ శిల్ప కళ అద్భుతం



గౌరీలక్ష్మీబాయికి జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పెనుకొండ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): విజయనగర సామ్రాజ్య రెండో రాజధాని పెనుకొండలో ప్రాచీన కట్టడాలు, దేవాలయాలపై శిల్ప కళ అద్భుతమని కేరళ ట్రావెన్‌కోర్ సంస్థాన రాజవంశీకురాలు, పద్మశ్రీ పురస్కార గ్రహీత అశ్వతి తిరునాళ్ గౌరీ లక్ష్మీబాయి పేర్కొన్నారు. చరిత్ర పరిశోధకుడు మైనాస్వామితో కలిసి ఆమె ఆదివారం పెనుకొండలోని రాయలకాలంనాటి కోట గోడలు, భవనాలు, ఆలయాలను సందర్శించారు. కోటగోడలోని ఆలయాల్లో శిలాశాసనాల గురించి చరిత్రకారుడు మైనాస్వామి వివరించారు. 1405 నాటి ఐముక్తేశ్వర, 1510 నాటి కాశీవిశ్వేశ్వర, రామభద్రాలయాలను ఆమె సందర్శించారు. ఆమె మాట్లాడుతూ.. విజయనగర రాజుల కాలంనాటి శిల్పకళ అద్భుతమని కొనియాడారు. కాశీ విశ్వేశ్వరాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు డా.రంగనాథ్‌రెడ్డి, అర్చకులడు చంద్రశేఖర్.. ఆమెను సన్మానించి, జ్ఞాపిక అందజేశారు.

హోరాహోరీగా హాకీ పోటీలు

రాష్ట్ర పోటీల్లో ఫైనల్‌కు చేరిన కడప, అనంతపురం జట్లు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో 15వ ఆంధ్రప్రదేశ్ సీనియర్ మహిళా హాకీ చాంపియన్‌షిప్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. ఆదివారం నెల్లూరు, గుంటూరు జట్లు తలపడగా 3-0 తేడాతో నెల్లూరు, అనంతపురం, తిరుపతి జట్ల మధ్య జరిగిన పోటీలో అనంతపురం 1-0 తేడాతో, అనకాపల్లి, నెల్లూరు మధ్య మ్యాచ్‌లో అనకాపల్లి 3-0 తేడాతో విజయం సాధించాయి. విశాఖపట్నం, కర్నూలు జట్ల పోటీలో విశాఖపట్నం 8-0 తేడాతో, సత్యసాయి, శ్రీకాకుళం జిల్లా జట్ల పోటీలో శ్రీకాకుళం 2-1 తేడాతో, ప్రకాశం, ఎన్‌టీఆర్ జిల్లా పోటీలో ప్రకాశం జట్టు 1-0 తేడాతో గెలుపొందాయి. కాకినాడ-సత్యసాయి జిల్లాల పోటీలో కాకినాడ 2-0 గోల్స్‌తో, అనకాపల్లి-గుంటూరు మ్యాచ్‌లో అనకాపల్లి 9-0గోల్స్‌తో, తిరుపతి-ఎన్‌టీఆర్ జిల్లా పోటీలో తిరుపతి 2-0గోల్స్‌తో విజేతలుగా నిలిచాయి. కడప-విశాఖపట్నం పోటీలో కడప 3-0గోల్స్‌తో, కాకినాడ-శ్రీకాకుళం జిల్లాల పోటీలో కాకినాడ 6-0 గోల్స్‌తో విజయం సాధించాయి. అనంతపురం జట్టు ఎన్‌టీఆర్ జిల్లా జట్టుపై 6-0 గోల్స్‌తో, తిరుపతి జట్టు ప్రకాశం జట్టుపై 3-1గోల్స్‌తో, కడప జట్టు కర్నూలుపై 7-0 గోల్స్‌తో జయభేరి మోగించాయి. సాయంత్రం జరిగిన సెమీఫైనల్స్ మొదటి మ్యాచ్ కాకినాడ, కడప జట్ల మధ్య ఉత్కంఠగా సాగింది. కడప జట్టు 5-4 గోల్స్ తేడాతో విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకుంది. రెండో మ్యాచ్‌లో అనకాపల్లి, అనంతపురం జట్లు తలపడగా ఈ పోటీ కూడా చివరి వరకు హోరాహోరీగా సాగింది. చివరలో అనంతపురం జట్టు ఆధిక్యత ప్రదర్శించి 3-2 గోల్స్ తేడాతో విజయం సాధించి ఫైనల్స్‌లోకి ప్రవేశించింది. సోమవారం మూడవ స్థానం కోసం కాకినాడ-అనకాపల్లి జట్లు తలపడనుండగా, ఫైనల్స్‌లో కడప, అనంతపురం జట్లు ఢీకొననున్నాయి. హాకీ ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీలను ఆ సంఘం కార్యనిర్వహక కార్యదర్శి పీ థామస్ పీటర్, కార్యదర్శి పీ జగన్మోహన్, కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

నేటి నుంచి టెన్త్ ప్రీ ఫైనల్ పరీక్షలు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు సోమవారం నుంచి ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఆదివారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. పదిరోజుల పాటు పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరుగుతాయని అధికారులు తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదిక సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో కొనసాగుతుందని కలెక్టరు వినోద్‌కుమార్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని అన్నిశాఖల ఉన్నతాధికారులు పాల్గొంటారని వెల్లడించారు.

పామిడిలో 20 తులాల బంగారం చోరీ

పామిడి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పామిడిలోని వెంగమనాయుడు కాలనీలో శనివారం రాత్రి ఓ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసుల వివరాల మేరకు... పట్టణంలోని వెంగమనాయుడు కాలనీకి చెందిన శ్రీనివాసరెడ్డి ఫొటోగ్రాఫర్‌గా జీవనం కొనసాగిస్తున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి శనివారం కసాపురం ఆంజనేయస్వామి దేవస్థానానికి వెళ్లారు. ఇదే అదునుగా దుండగులు ఇంటిలోకి చొరబడి బీరువా తలుపులు పగులగొట్టి అందులోని 20 తులాల బంగారు ఆభరణాలను అపహరించారు. విషయం తెలుసుకున్న గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వస్త్ర దుకాణంలో మోసం

శింగనమల ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఫోన్‌పే నకిలీ స్ర్కీన్ షాట్ చూపి ముగ్గురు మహిళలు వస్త్ర దుకాణ యజమానిని మోసం చేశారు. యజమాని హుస్సేన్ తెలిపిన మేరకు.. ఆదివారం సాయంత్రం శింగనమల పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న వస్త్ర దుకాణానికి ముగ్గురు మహిళలు కారులో వచ్చారు. అరగంటలో రూ.6,200 విలువగల డ్రస్సులు, చీరలు తీసుకున్నారు. డబ్బులు వేస్తామని చెప్పి ఫోన్‌పే స్కాన్ చేశారు. రూ.6,200 గతంలో ఎక్కడో వేసిన స్ర్కీన్‌షాట్‌ను యజమానికి చూపారు. పనిలో ఉండి వచ్చిందిలే అనుకున్నాడు. వెంటనే ఆ ముగ్గురు కారులో వెళ్లిపోయారు. అరగంట తరువాత వచ్చిన యజమాని కుమారుడు ఖాతాలో డబ్బులు జమ కాలేదని గ్రహించాడు. ఈ ముగ్గురు దుకాణంలో చీరలు, డ్రస్సులు తీసుకున్న దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయి ఉండడంతో యజమాని పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ విషయంపై ఎస్ఐ విజయ్‌కుమార్‌ను వివరణ కోరగా... దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

మోస్ట్ వాంటెడ్ ధార్ గ్యాంగ్..

60 మంది సభ్యులు.. అందరిపైనా పదుల సంఖ్యలో కేసులు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్ రాష్ట్రం ధార్ జిల్లాకి చెందిన దొంగల ముఠా అంటే దేశవ్యాప్తంగా చోరీలకు పెట్టింది పేరు. 60 మంది సభ్యులున్న ఈ ముఠా ఆగడాలను వింటే హడలెత్తిపోవాల్సిందే. వీరు ఎక్కడికైనా వెళ్లారంటే భారీ చోరీలకు పాల్పడతారు. ముఠా సభ్యులందరిపై పదుల సంఖ్యలో కేసులున్నాయి. చాలామంది జైళ్లలో ఉన్నారని తెలిసింది. ఎన్ని కేసులున్నా.. ఎన్నిసార్లు జైలుకు వెళ్లొచ్చినా చోరీలను మాత్రం ఆపరని పోలీసు వర్గాల ద్వారా తెలుస్తోంది. అనంతపురం నగర శివారులోని రాజహంస స్వీట్ హోమ్స్‌లోని మూడు విల్లాస్‌లలో గత నెల 21న భారీ చోరీ ధార్ గ్యాంగ్ పనేనని పోలీసులు తేల్చారు. ముగ్గురిని అరెస్టు చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు జిల్లా ఎస్పీ జగదీష్ వెల్లడించారు. స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో కేసు ఛేదింపు వివరాలను ఎస్పీ వెల్లడించారు. నిందితుల నుంచి 59తులాల బంగారు ఆభరణాలు, రూ.19.35 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు.



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న నగదు, నగలను పరిశీలిస్తున్న ఎస్పీ సిబ్బంది

అపహరించిన బైక్‌లలో..

మధ్యప్రదేశ్ రాష్ట్రం ధార్ జిల్లా చడ్‌వాడ్ గ్రామానికి చెందిన నారు పచావర్, సావన్, అదే జిల్లాకు చెందిన మహబత్, మోట్ల ముఠాగా ఏర్పడ్డారు. గతనెల 16న స్వగ్రామం నుంచి బయలుదేరి ఇండోర్, ఇటార్సి వరకు బస్సులో వచ్చారు. అక్కడి నుంచి నేరుగా తమిళనాడులో సేలంకు రైలులో చేరుకున్నారు. అటు నుంచి ధర్మపురికి వెళ్లి రెండు బైక్‌లను అపహరించారు. బెంగుళూరు మీదుగా ఆ బైక్‌లలో శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ వైపు వచ్చారు. పెనుకొండ సమీపంలో వీరు వస్తున్న బైక్‌లలో ఒక దానికి రిపేరీ రావడంతో వదిలేశారు. సమీపంలో మరో బైక్ అపహరించి అనంతపురం చేరుకున్నారు. నగరంలో రెక్కీ నిర్వహించారు. శివారులోని రాజహంస స్వీట్ హోమ్స్‌లోని వెంకటశివారెడ్డి, రంజిత్‌రెడ్డి, శివశంకర్‌నాయుడుకు చెందిన విల్లాస్‌లలో గతనెల 21న రాత్రి చోరీలు చేశారు. మొత్తం రూ.2.13కోట్లకుపైగా విలువైన బంగారు ఆభరణాలు, వజ్రాలను అపహరించారు. దీనిపై అనంతపురం ఎస్పీ జగదీష్ ప్రత్యేక దృష్టి సారించారు. నాలుగు పోలీసు బృందాలను రంగంలోకి దింపారు. అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో సీఐలు సాయినాథ్, హేమంత్‌కుమార్, జయపాల్ రెడ్డి, ఎస్ఐలు రాంప్రసాద్, రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాలుగు బృందాలుగా ఏర్పడి దొంగల కోసం వేట మొదలు పెట్టారు. సీసీ కెమెరాల ఫుటేజీ, టోల్‌గేట్ల వద్ద లభించిన ఆధారాలతో దర్యాప్తు చేపట్టారు. దొంగల ఫింగర్ ప్రింట్స్ ఆధారంగానే వారి మొబైల్ నంబర్లను ట్రేస్ చేసినట్లు సమాచారం.

విక్రయించే ప్రయత్నంలో..

అనంతపురంలో చోరీ చేశాక బైక్‌లలోనే నిందితులు హైదరాబాద్ వెళ్లారు. నలుగురు వాటాగా పంచుకున్నారు. వారిలో నారు పచావర్, సావన్ హైదరాబాద్, బెంగుళూరులో సొత్తును విక్రయించే ప్రయత్నం చేసినా కుదర్లేదు. దీంతో కీలక వ్యక్తి మధ్యప్రదేశ్‌కు చెందిన రమేష్‌ను సంప్రదించారు. చోరీ సొమ్ము కొనాలని కోరారు. అందుకు అతడు.. తన కొడుకు సునీల్‌ను పంపాడు. ఈ ముగ్గురు అనంతపురం నగరంలోని రాయల్‌నగర్‌లో ఉండగా పోలీసులు పట్టుకున్నారు. అటు మహమత్, మోట్ల దొంగసొత్తులు పంచుకున్నాక స్వగ్రామానికి వెళ్లారు.

అందరిపైనా కేసులు..

ప్రస్తుతం అరెస్టయిన ముగ్గురు, పరారీలో ఉన్న మరో ఇద్దరు కూడా పాత నేరస్తులే. ఈ ఐదుగురిలో నారు పచావర్, మహబత్ కీలకం. ఇద్దరూ స్వయానా అన్నదమ్ములు. వారి ముగ్గురు సోదరులు సైతం నేరస్తులే. వారంతా హైదరాబాద్‌లోని జైలులో ఉంటున్నారు. పచావర్‌పై ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల్లో 32 కేసులున్నాయి. మహబత్‌పై నాలుగు రాష్ట్రాల్లో 29కిపైగా కేసులు నమోదయ్యాయి. సావన్, సునీల్, మోట్లపై కేసులున్నాయి. సునీల్‌పై 9, అతడి తండ్రి రమేష్‌పై ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, గుజరాత్ రాష్ట్రాల్లో 32 కేసులున్నాయి. ఈ గ్యాంగ్ అంతా ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల్లో మోస్ట్ వాంటెడ్‌గా ఉంటోంది. మొత్తం ఈ గ్యాంగ్‌లో 60మంది సభ్యులుగా ఉంటారు. వీరంతా మధ్యప్రదేశ్ రాష్ట్రం ధార్ జిల్లా టాండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు చెందిన వారే. ఐదారుగురు కలిసి గ్యాంగ్‌గా ఏర్పడి చోరీలు చేస్తారు. వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ ప్రవృత్తిగా చోరీలకు పాల్పడతారు. పగలు రెక్కీ నిర్వహించి, రాత్రి చోరీలు చేస్తుంటారు. చిన్న వయసులోనే పెళ్లిళ్ల చేసుకుని, వ్యసనాలకు బానిసలై, వాటిని తీర్చుకోవడానికి చోరీల బాట పట్టారు.

సొత్తంతా రమేష్‌కే విక్రయం...

తాళం వేసిన ఇళ్లలో చోరీ చేసిన సొత్తులను గ్యాంగ్ సభ్యులు.. రమేష్‌కు విక్రయిస్తారు. బంగారు ఆభరణాలు, వస్తువులు క్రయవిక్రయాల్లో తూకం వేస్తారు. రమేష్‌తో బేరంలో అవన్నీ సాగవు. దొంగసొత్తును తూకం కూడా వేయకుండా తోచినట్లు లెక్కకట్టి డబ్బు ఇస్తాడట.

ఎస్పీ ప్రశంస...

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల పోలీసులకు మోస్ట్ వాంటెడ్‌గా ఉంటూ పలు చోరీలకు పాల్పడిన ధార్ గ్యాంగ్‌ను అరెస్టు చేసిన అనంత పోలీసు అధికారులను ఎస్పీ ప్రశంసించారు. అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు సాయినాథ్, హేమంత్‌కుమార్, జయపాల్‌రెడ్డి, ఎస్ఐలు రాంప్రసాద్, రాజశేఖర్‌రెడ్డి, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ఉపాధి సిబ్బందిపై క్రిమినల్ కేసులు

అవినీతి రూ.1.5 కోట్లు.. రూ.18.74 లక్షలకే ఫిర్యాదు

మరికొందరిని వదిలేయడంపై అనుమానాలు

విడపనకల్లు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో అక్రమార్కులపై ఆ శాఖ అధికారులు చర్యలకు దిగారు. మండలంలోని పాల్తూరు, ఆర్.కొట్టాల, కరకముక్కల గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనుల్లో జరిగిన అక్రమాలపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. విడపనకల్లు మండలానికి చెందిన ఉపాధి హామీ పథకం ఏపీఓ సంజీవకుమార్ రూ. 5,33,625, ఇన్‌చార్జి ఏపీఓ రామ్మోహన్ రూ. 1,23,051, బీఎఫ్‌టీ హెచ్.రామాంజనేయులు రూ. 46,402లు, సీఓలు దాసప్పగారి ధనుంజయ రూ. 1,06,243, సుభాన్ రూ. 4,42,569, ఫీల్డ్ అసిస్టెంట్లు డి.రామస్వామి రూ.1,22,407, గురుస్వామి రూ.4,45,583, బి.మంజునాథ రూ. 54,514 అవినీతికి పాల్పడినట్లు పేర్కొంటూ వీరిపై శనివారం విడపనకల్లు పోలీస్ స్టేషన్‌లో ఎంపీడీఓ షకీలాబేగం ఫిర్యాదు చేశారు. 2023-24వ సంవత్సరం జరిగిన ఉపాధి హామీ పనులపై గత డిసెంబరు 3న సామాజిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన ఉపాధి హామీ సిబ్బంది బోగస్ జాబ్‌కార్డులను సృష్టించి పాల్తూరు గ్రామంలోనే రూ. 28 లక్షలు అవినీతి చేసినట్లు నిగ్గు తేల్చారు. ఆర్.కొట్టాల-డొనేకల్లు రోడ్డు వేయకున్నా వేసినట్లు ఎం.బుక్‌లు రికార్డు చేసి సుమారు రూ. 32లక్షలు డ్రా చేశారు. పై స్థాయి అధికారులను వదిలేసి కింది స్థాయి సిబ్బందిపై మాత్రమే క్రిమినల్ కేసులు నమోదు చేయటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మండలంలో రూ. 1.50 కోట్లకు పైగా అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీ అధికారులు నిగ్గు తేల్చగా.. కేవలం రూ. 18 లక్షలు అవినీతి జరిగిందని కింది స్థాయి సిబ్బందిపై కేసులు పెట్టడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అప్పటి పీఓ, పీఆర్ ఏఈ పై క్రిమినల్ కేసులు ఎందుకు పెట్టలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ముగిసిన రాష్ట్రస్థాయి చెస్ పోటీలు



విజేతలకు షీల్డ్, ట్రోఫీ అందజేస్తున్న రైల్వే సీఐ కుమార్

ధర్మవరం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): చెస్ టోర్నీ వల్ల క్రీడాకారుల్లో ఏకాగ్రతతో పాటు మేధస్సు కూడా పెంపొందుతుందని రైల్వే సీఐ బోయకుమార్, ఏపీ చెస్ అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి సుమన్ పేర్కొన్నారు. పట్టణంలోని కొత్తపేట శ్రీఉషోదయ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో హైబ్రో చెస్ అకాడమీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన 7వ రాష్ట్రస్థాయి చెస్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో ధర్మవరం వాసి దుర్గాప్రసాద్ ప్రథమ బహుమతి సాధించగా, ద్వితీయ బహుమతి అఫ్రీద్‌ఖాన్, తృతీయ బహుమతి భరత్‌భూషణ్ కైవసం చేసుకున్నారు. వీరికి రైల్వే ముఖ్య అతిథులు బహుమతులు, షీల్డ్ అందజేశారు. యువర్స్ ఫౌండేషన్ సహకారంతో హైబ్రో చెస్ అకాడమి నేతృత్వంలో 7వ రాష్ట్రస్థాయిఓపెన్ చెస్ టోర్నీ ఉత్కంఠ భరితంగా సాగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 270 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం, ఉపాధ్యక్షుడు సుంకుకుమార్, ట్రెజరర్ మోహన్, ఇంకా.. చాంద్‌బాషా, డాక్టర్ బీవీ సుబ్బారావు, జాకీర్‌హుస్సేన్, శ్రీనివాసులు, రమేశ్‌బాబు పాల్గొన్నారు.

ఆత్మహత్యల పర్వం

జిల్లాలో వేర్వేరుచోట్ల ఐదుగురి బలవన్మరణం

అనంతపురం క్రైం/సెంట్రల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేర్వేరుచోట్ల ఆదివారం ఐదుగురు ఆత్మహత్య చేసుకున్నారు. ప్రేమ పేరుతో ఓ యువకుడి వేధింపులు తాళలేక ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. ఇటుకలపల్లి ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన మేరకు... అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లి ఎస్సీ కాలనీలో రామచంద్ర కుమార్తె కడప శిరీష (21) డిగ్రీ పూర్తి చేసింది. అదే గ్రామానికి చెందిన పిన్నదరి పోతులయ్య కుమారుడు వంశీ శిరీషను ప్రేమ పేరుతో వేధించేవాడు. దీంతో మనస్తాపం చెందిన శిరీష ఆదివారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ విజయ్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇటుకలపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, యువతి ఆత్మహత్యకు కారణమైన వంశీ అనే యువకుడిని కఠినంగా శిక్షించాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు.

బుడ్డప్పనగర్‌లో మహిళ..

అనంతపురం నగరంలో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. స్థానిక బుడ్డప్పనగర్‌కు చెందిన శ్యామల (29) ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆలస్యంగా గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో రిటైర్డ్ ఉద్యోగిని..

పదవీ విరమణ పొందిన ఓ మహిళ అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకుంది. నగర శివారులోని బళ్లారి రోడ్డు స్ర్పింగ్ ఫ్యాక్టరీ సమీపంలో కొప్పాల లక్ష్మీదేవమ్మ(75) నివాసముంటోంది. ఆమె అటెండర్‌గా పనిచేస్తూ రిటైర్డ్ అయ్యారు. భర్త సంజీవయ్య కొన్నేళ్ల క్రితం మృతి చెందారు. వారికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. వారిలో కుమార్తె తులసమ్మ ఇంట్లో నివాసముంటున్నారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేది. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన లక్ష్మీదేవమ్మ కుమార్తె, అల్లుడు ఫంక్షన్‌కు వెళ్లిన సమయంలో ఆదివారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది.

మేడాపురంలో మరొకరు..

చెన్నేకొత్తపల్లి: ఉరివేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని మేడాపురం గ్రామం లో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు...గ్రామానికి చెందిన మట్టా ప్రకాశ్(40) వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇంటిలో ఎవరు లేని సమయంలో ఉరివేసుకున్నాడు. చుట్టుప్రక్కల వారు గమనించి ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య సాయిలీల, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.



మట్టా ప్రకాశ్(ఫైల్)

నిప్పంటించుకుని యువకుడు..

అనంతపురం క్రైం: నగర శివారులోని నేషనల్ పార్కు సమీపంలోని పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుని యువకుడు అభిలాష్(26) మృతిచెందాడు. ఇదివరకు ప్రభుత్వాసుపత్రిలో ల్యాబ్‌టెక్నీషియన్‌గా పని చేస్తుండేవాడు. ఆదివారం రాత్రి 8.30గంటల సమయంలో శిల్పారామానికి కిలోమీటర్ దూరంలోని రైల్వే ట్రాక్ సమీపంలో ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్నాడు. తీవ్ర కాలిన గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. అభిలాష్ నగరంలోని పాతూరు వాసి అని తెలుస్తోంది. శ్రీ సత్యసాయి జిల్లా కదిరి ప్రాంతానికి చెందిన ఓ అమ్మాయిని ప్రేమించాడని సమాచారం. ఆ అమ్మాయికి నిశ్చితార్థం అయినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మనస్తాపం చెంది అభిలాష్ ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఆత్మహత్య చేసుకున్నాడా..? ఎవరైనా పెట్రోలు పోసి నిప్పంటించారా..? అనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. కాగా అటు త్రీటౌన్, ఫోర్త్‌టౌన్ పోలీసు స్టేషన్లకు సంబంధించి ఎవరి పరిధిలోకి వస్తుందో స్పష్టత రాలేదట. ఇరు స్టేషన్లకు చెందిన పోలీసులు రాత్రి 10.30 గంటలకు మృతదేహం వద్దకు వెళ్లారు.



అభిలాష్ (ఫైల్)

టీడీపీ, వైసీపీ నాయకుల ఘర్షణ

- ఇద్దరికి గాయాలు



దాడిలో గాయపడిన టీడీపీ నాయకుడు బోర్ల చెన్నప్ప

కనగానపల్లి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూంచెర్ల, గుంతపల్లి గ్రామాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఆదివారం తగరకుంట గ్రామంలో పరస్పరం దాడులు చేసుకున్నారు. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు.. తూంచెర్ల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బోర్ల చెన్నప్ప వ్యక్తిగత పనిమీద తగరకుంటకు వెళ్లాడు. అక్కడ వెల్డింగ్‌షాపు యజమాని అప్పు ఉండటంతో డబ్బుల కోసం చెన్నప్ప వెల్డింగ్‌షాపు వద్దకు వెళ్లాడు. అంతకు ముందే గుంతపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు నరసింహ, ఆనందరెడ్డితో పాటు మరో ముగ్గురు వెల్డింగ్‌షాపు వద్ద ఉన్నారు. ఈ క్రమంలో ఒకరికొకరు కవ్వింపు చర్యలకు పాల్పడి గొడవపడ్డారు. దీంతో ఇరువురు ఒకరిపై ఒకరు కట్టెలు, మచ్చుకత్తితో దాడులు చేసుకున్నారు. దీంతో నరసింహకు కాలుకు, బోర్ల చెన్నప్ప తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఇద్దరిని అనంతపురంలోని వేర్వేరు ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారు. ఇద్దరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహమ్మద్ రిజ్వాన్ తెలిపారు.

సామాజిక స్పృహ కలిగిన రచయిత జూపల్లి

- పుస్తకావిష్కరణ సభలో వక్తలు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 9:(ఆంధ్రజ్యోతి): సామాజిక స్పృహ కలిగిన రచయిత జూపల్లి ప్రేమ్‌చంద్ అని పలువురు వక్తలు కొనియాడారు. అవేద, నిచ్చెనమెట్ల లోలకం తదితర గ్రంథాల ద్వారా తెలుగు సాహిత్యంలో తనదైన ముద్ర వేసుకున్నారని తెలిపారు. ఆదివారం ఏపీ అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎన్జీఓ హోంలో జూపల్లి ప్రేమ్‌చంద్ రచించిన 'ఆధునిక తెలుగు వచన కవిత్వం - విభిన్న ధోరణులు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి మాట్లాడుతూ.. ప్రేమ్‌చంద్ చైతన్యవంతమైన సాహిత్యాన్ని అందించారని అన్నారు. ఆధునిక తెలుగు కవిత్వంలో వచ్చిన ధోరణులను నిశితంగా పరిశీలించి భావితరాలకు గొప్ప సిద్ధాంత గ్రంథాన్ని అందించారన్నారు. అరసం జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, సాహితీకారులు జంగా గౌతమ్, తూముచర్ల రాజారామ్, ఉప్పరపాటి వెంకటేశులు, నానీల నాగేంద్ర, జూపల్లి ప్రేమ్‌చంద్ సతీమణి రాజేశ్వరి, ఆయన సంతానం శంతన్, అపర్ణతోపాటు నాగలింగయ్య, తస్నీరు నాగేంద్ర, షేక్ నబిరసూల్, రియాజుద్దీన్, జూటూరు షరీఫ్, మధురశ్రీ పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

లో ఓల్టేజీతో రైతులకు కష్టాలు



ఆత్మకూరు సబ్‌స్టేషన్

- వ్యవసాయానికి ఏడు గంటలే ఇస్తున్నారని ఆవేదన
- సబ్‌స్టేషన్ సామర్థ్యం తక్కువ : అధికారులు



లోఓల్టేజీ అందిస్తున్న ట్రాన్స్ ఫార్మర్

ఆత్మకూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తాం అంటూ ప్రకటనలకే పరిమితం తప్ప అచరణలో లేదు. ఆత్మకూరు సబ్‌స్టేషన్ పనితీరే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. మండలంలో ఆత్మకూరు, వడ్డుపల్లి, సనపలలో మూడు సబ్‌స్టేషన్లు ఉన్నాయి. వడ్డుపల్లి, సనప సబ్‌స్టేషన్ల ద్వారా వ్యవసాయానికి తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నారు. అయితే ఆత్మకూరు సబ్‌స్టేషన్ పరిధిలో మాత్రం ఏడుగంటలు మాత్రమే విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. ఆత్మకూరు సబ్‌స్టేషన్‌కు 88ఎంవీఏ కెపాసిటీ మాత్రమే ఉంది. కేవలం రెండు ఫీడర్ల ద్వారా ఇంటి అవసరాలకు, వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేస్తారు. దీంతో ఎప్పుడూ లోఓల్టేజీ సమస్య నెలకొని, రైతుల కష్టాలు వర్ణణాతీతంగా మారాయి. ఎన్నోసార్లు పాలకులకు, అధికారులుకు వినతి పత్రాలు అందించి అలసిపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సబ్‌స్టేషన్ సామర్థ్యాన్ని పెంచితే తప్ప వ్యవసాయానికి అనుకూలంగా విద్యుత్ సరఫరా చేయవచ్చని అంటున్నారు. అయితే ఇప్పుడున్న స్థలం తగినంత లేకపోవడం వల్ల సబ్‌స్టేషన్ సామర్థ్యం పెంచేందుకు సాధ్యం కావడం లేదని అధికారులు చెబుతున్నారు. అయితే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి వ్యవసాయానికి తొమ్మిది గంటల పాటు విద్యుత్ సరఫరా చేయాలని స్థానిక రైతులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా ఈ సబ్‌స్టేషన్ పరిధిలో హెచ్‌వీడీఎస్ ద్వారా కొందరికి ట్రాన్స్ ఫా ర్మర్లు ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటికీ ఆత్మకూరులో ఎస్ఎస్- 1 ట్రాన్స్‌ఫార్మర్ కింద 100 హెచ్‌పీతో 30 మోటార్లు ఆడుతున్నాయని రైతులు వాపోతున్నారు. వీటిలో పలు అక్రమ కనెక్షన్లు ఉన్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో మిగిలిన రైతులు లో ఓల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారంటున్నారు. సమస్య పరిష్కరించాలని అధికారులుకు విన్నవించినా ఫలితం లేదంటున్నారు. కొందరు రైతులు డీడీలు తీసి నెలలు గడుస్తున్నా ట్రాన్స్‌ఫార్మర్లుగానీ, వైరు గానీ అందించలేదం టున్నారు. ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కూడా లో ఓల్టేజీతో తరుచూ కాలిపోతుండడంతో మరమ్మతులు చేయించుకోలేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి కైనా అధికారులు తగిన చర్యలు తీసుకొని లోఓల్టేజీ సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ఇంకో ట్రాన్‌ఫార్మర్ ఇవ్వాలి



ఎస్ఎస్-1 ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో లోఓల్టేజీ సమస్య అధికంగా ఉంది. దీంతో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ కోసం డీడీలు తీసి, చాలారోజులు అయింది. ఇంతవరకు ట్రాన్స్‌ఫార్మర్ గానీ, వైరు గానీ ఇవ్వలేదు. లోఓల్టేజీతో ఇబ్బంది పడుతున్నాం అధికారులు తగిన చర్యలు తీసుకుని మా సమస్యను పరిష్కరించాలి.

- ఈశ్వర రెడ్డి, రైతు, ఆత్మకూరు

వ్యవసాయానికి 9 గంటలు ఇవ్వాలి



ప్రభుత్వం అందరితో పాటు మాకు కూడా వ్యవసాయానికి తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా చేయాలి. మా సబ్‌స్టేషన్ పరిధిలో లోఓల్టేజీ ఉంది. సబ్‌స్టేషన్ కెపాసిటీ పెంచి రైతులకు న్యాయం చేయాలి. తక్కువ విద్యుత్ సరఫరాతో పంటలు పండించుకోలేక పోతున్నాం. అధికారులు, పాలకులు మాపై దయ చూపాలి.

- జయరాములు, రైతు, ఆత్మకూరు

సబ్‌స్టేషన్ సామర్థ్యం పెంచే అవకాశం లేదు

సబ్‌స్టేషన్ పరిధిలో లో ఓల్టేజీ సమస్య ఉన్నది వాస్తవమే. కానీ సబ్‌స్టేషన్ కెపాసిటీ పెంచడాకికి అవకాశం లేదు. స్థలం తగినంత లేకపోవడంతో ఇప్పుడున్న సామర్థ్యం ద్వారానే సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేయగలుగుతున్నాం. ఏమి చేయలేక పోతున్నాం. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు సహకరించి రైతుల సమస్యను పరిష్కరించాలి. మా చేతుల్లో ఏమీలేదు. విషయాన్ని ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకెళ్లాం. అనుమతులు వచ్చి, తగిన చర్యలు తీసుకుంటే వ్యవసాయానికి, ఇళ్లకు నాణ్యమైన విద్యుత్ అందిస్తాం.

-దాస్, విద్యుత్ శాఖ ఏఈ, ఆత్మకూరు

న్యూస్ బాక్స్

అట్టహాసంగా వార్షికోత్సవాలు



అలంకరణలో శారదామాత

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): శారదా నగర్‌లోని శృంగేరి శంకరమఠంలో శనివారం నుంచి నిర్వహిస్తున్న 30వ వార్షికోత్సవాలు ఆదివారం అట్టహాసంగా ముగిశాయి. మఠం ఆవరణలో గణపతి, రుద్ర, చండీ హోమాలు చేశారు. ఆలయంలో శారదా మాతతో పాటు శంకరాచార్యులు, సిద్ధిగణపతి మూలవిరాట్లకు విశేష అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు, పూజాది కైంకర్యాలు నిర్వహించారు. మహిళలు సామూహిక లలితా సహస్రనామ పారాయణ చేశారు. మహామంగళహారతి అనంతరం అన్నదానం చేశారు. సాయంత్రం బ్రహ్మశ్రీ సంతోష్ కుమార్ ఘనపాఠి శృంగేరి పీఠ విశిష్టతపై ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. కార్యక్రమంలో మఠం కార్యనిర్వహణాధికారి సత్యప్రసాద్, మోహన్, భక్తులు పాల్గొన్నారు.



లలితా సహస్రనామ పారాయణం చేస్తున్న మహిళలు

టమోటా కిలో రూ.13

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 13తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు ఆదివారం 600 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 10, కనిష్ఠ ధర రూ. 7 పలికినట్లు ఆయన తెలిపారు.

పశువుల సంత ఆదాయం రూ.3.83 లక్షలు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు పశువులసంతతో రూ. 3,83,340 ఆదాయం వచ్చినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ. 2,10,240, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ. 1,73,100 వచ్చిందని ఆయన తెలిపారు.

ఏపీవీబీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మణి రవి



అనంతపురం రూరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఏపీ వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జిల్లా కేంద్రానికి చెందిన మణిరవి నియమితులయ్యారు. ఆ మేరకు ఆదివారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విక్రమ్ నాయుడు బోయ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా మణి రవి మాట్లాడుతూ... సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తనకు అవకాశం కల్పించిన రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధికి, బోయ కులస్థుల సమస్యల పరిష్కరానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి

- ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

నార్పల, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని గడ్డం నాగేపల్లిలో సీపీఐ అనుబంధ ఏపీ వ్యవసాయకార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పేదల నుంచి ఇళ్ల స్థలాల అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల కార్యదర్శి పెద్దపెద్దయ్య మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. పట్టణాలలో రెండు సెంట్లు, పల్లెల్లో మూడు సెంట్ల స్థలాలు ఇవ్వాలన్నారు. ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి సాకే గంగాధర, సీనియర్ నాయకులు సుధాకర్, సహాయ కార్యదర్శి చాపల రామాంజి, సూరి, చంద్ర, నారప్ప, నాగలక్ష్మి, చిన్నక్కయ్య, అలివేలమ్మ, తులసమ్మ, పాపోడు రాముడు, చిన్నవీరన్న, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి

- వ్యవసాయాధికారి

గార్లదిన్నె, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రైతులకు విశిష్టత గుర్తింపు సంఖ్య తప్పని సరి అని మండల వ్యవసాయాధికారి సోమ శేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాల్లో అక్రమాలు చోటుచేసుకోకుండా అర్హులైన రైతులకు లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వం ఫార్మర్ పేరుతో ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య ఇచ్చేందుకు నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. రైతుకు విశిష్ట గుర్తింపు ప్రక్రియ కార్యక్రమాన్ని సోమవారం నుంచి చేపడుతున్నట్లు తెలిపారు. ఫార్మర్స్ రిజిస్ట్రీ పోర్టల్‌లో రైతు వివరాలను నమోదు చేస్తారన్నారు. రైతు సేవా కేంద్రంలో రైతు పేరు, ఊరి పేరు, ఆధార్ నంబర్, భూమి పాసుపుస్తకం. ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నంబరు అందసేస్తే రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందుతారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే వివిధ పథకాలు లబ్ధి పొందాలంటే రైతులందరు తప్పనిసరిగా రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలని సూచించారు.

కేబుల్ చోరీ



చిన్నమట్లగొందిలో కేబుల్ చోరీ అయిన బోరు

శింగనమల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద మట్లగొంది, చిన్న మట్లగొంది గ్రామాల్లో పలు వ్యవసాయ బోర్లకు చెందిన కేబుల్ చోరీ కావడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. ఆ రెండు గ్రామాల్లో అరు వ్యవ సాయ బోర్లకు సంబంధించిన 70 మీటర్ల కేబుల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు శనివారం రాత్రి ఎత్తుకెళ్లారు. చంద్ర, పుల్లయ్య, సూరి అనే రైతులు కేబుల్ వైర్లు చోరీ చేశారు. గత వారంలో ఈ రెండు గ్రామాలతో పాటు ఈస్టు నరసాపురం, సోదనపల్లిల్లో 10 వ్యవసాయ బోర్ల వద్ద కేబుల్ , డ్రిప్పు వైర్లు చోరీ అయ్యాయి. అప్పట్లో కొందరు రైతులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రాజకీయాలకు అతీతంగా సీఎంఆర్ఎఫ్ పంపిణీ

- ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా బాధితులకు సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. నగరంలోని టీడీపీ అర్బన్ కార్యాలయంలో ఆదివారం తొమ్మిది మందికి రూ. 9.30 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యేకి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గు పాటి మాట్లాడుతూ... గత ఎనిమిది నెలల్లో అర్బన్ పరిధిలోని 48 మందికి రూ.66.62 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసినట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ వర్తించని వారికి సీఎంఆర్ఎఫ్ నిధులు మం జూరు చేస్తామన్నారు. పేదలకు కష్టం ఉందంటే ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా సీఎం చంద్రబాబు స్పందిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే కృతజ్ఞత లు తెలియజేశారు. గత వైసీపీ హయాంలో సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు చేసిన దాఖలాలు లేవన్నారు. నాయకులు ముక్తియార్, పోతుల లక్ష్మీనరసింహులు, పీఎల్ఎన్ మూర్తి, చేపల హరి, సంగా తేజస్విని, గోపాల్ గౌడ్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

శీర్పి చెరువుకు చేరిన కృష్ణా జలాలు

బెళుగుప్ప, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి):హంద్రీనీవా పథకం నుంచి కృష్ణా జలాలు మండలంలోని శీర్పి చెరువుకు ఆదివారం చేరాయి. దీంతో వెంకటాద్రిపల్లి, శీర్పి గ్రామాల రైతుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. అంకంపల్లి పంపుహౌస్ నుంచి శనివారం నీరు వదలడంతో ఆదివారం చెరువుకు చేరా యి. రైతులతో పాటు టీడీపీ నాయకులు సునీల్, పెద్ద యర్రిస్వామి, జయరాములు, శశిభూషణ్ తదితరులు చెరువు వద్దకు వెళ్లి గంగ పూజ చేశారు. పలువురు మాట్లాడుతూ... మంత్రి పయ్యావుల కేశవ్ రైతులను ఆదుకోవడమే ధ్యేయంగా మండలంలోని రెండు చెరువులకు నీటి విడుదలకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారని హర్షం వ్యక్తం చేశారు.

869 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఆదివారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 904 క్యూసెక్కులున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 460 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు చూపర్లను ఆహూతులను అలరించాయి. నగరానికి చెందిన శ్రీదేవి కళా కేంద్రం నృత్యగురువు కుమారి సిమాజ ఆధ్వర్యంలో పలు ప్రదర్శనలు నిర్వహించారు. మహాగణపతిం, బాలత్రిపుర సుందరి, శివుడు ధరించిన, గుమ్మని ఏదిస్మృతి, కుందనపు బొమ్మ, ఇదిగో భద్రాద్రి, వేదములే, హిమగిరి, నగుమోము, నటేశ కౌతం తదితర వాటికి కళాకారులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో శిల్పారామం ఏఓ క్రిష్ణప్రసాద్, నృత్య కళాకారులు వర్షిత, నిహారిక, హర్షిక, వర్షిణి, రేషిక, తన్వి, ప్రియదర్శిని పాల్గొన్నారు.

తిరుమలలో ప్రదర్శనకు అవకాశం

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తిరుమలలో నిర్వహించనున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు అనంత కళాకారులకు అవకాశం లభించింది. ఈమేరకు ఓం సంగీత నృత్య కోలాట శిక్షణా సంస్థ అధ్యక్షురాలు దేవరకొండ కౌసల్య ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. దాస సాహిత్య ప్రాజెక్టు కింద ఈ అవకాశం వచ్చినట్లు తెలిపారు. ఈనెల 11, 12 తేదీల్లో తిరుమలలో నిర్వహించనున్న మెట్లోత్సవంలో పాల్గొనడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా కోలాటం, నృత్య ప్రదర్శనలు కళాకారులు ప్రదర్శిస్తారన్నారు.

యువకుడిపై వేటకొడవలితో దాడి

పామిడి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నారాయణస్వామి వీధి(సంతమార్కెట్)లో ఆదివారం రాత్రి ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. స్థానిక నారాయణ స్వామి వీధికి చెందిన ఓ యువకుడు తన స్నేహితురాలిని బస్టాండ్ వద్ద వదిలేందుకు వెళ్తుండగా.. అదే వీధికి చెందిన అజయ్ అనే యువకుడు కామెంట్ చేశాడు. వారి నడుమ వాగ్వాదం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న యువకుడి కుటుంబసభ్యులు రామాంజనేయులు మరికొందరు అజయ్‌పై కొడవలితో దాడి చేసి గాయపరిచారు. స్థానికులు అతడని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్సకు అనంతపురం ఆసుపత్రికి తరలించారు. పాతకక్షలతోనే అజయ్‌పై దాడి చేశారంటూ అతడి కుటుంబ సభ్యులు, బంధువులు పోలీసు స్టేషన్ వద్ద రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. పరిస్థితి విషమించకుండా గుత్తి సీఐ వెంకటేశ్వర్లు, పామిడి ఎస్ఐ రాంప్రసాద్, సిబ్బందితో తగు చర్యలు చేపట్టారు.

హెడ్ కానిస్టేబుల్‌కు అంత్యక్రియలు



నారాయణ నాయక్ (ఫైల్)

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): అనంతపురం టూటౌన్ పోలీసుస్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్ నారాయణ నాయక్(57) రోడ్డు ప్రమాదంలో గాయపడి.. హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మరణించాడు. ఆయన అంత్యక్రియలను ఆదివారం స్వగ్రామమైన శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి మండలం పెడపల్లి గ్రామంలో ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. ఆయన 1993లో పోలీస్ కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. హెడ్‌కానిస్టేబుల్‌గా ఉద్యోగోన్నతి పొందిన ఆయన అనంతపురం టూటౌన్ పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహించేవారు. ఆయనకు భార్య శాంతాబాయి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన అంత్యక్రియలలో అనంతపురం టూటౌన్ సీఐ శ్రీకాంత్, పుట్టపర్తిరూరల్ ఎస్ఐ లింగన్న, పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు సురేశ్‌కుమార్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ సభ్యుడు సాకేత్రి లోక్‌నాథ్, బంధువులు పాల్గొన్నారు.



గాలిలోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రామగిరి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కన్నతల్లిని, చదువుకున్న బడిని ఎన్నటికీ మరువరాదని వక్తలు పేర్కొన్నారు. మండలంలోని కుంటిమద్ది జడ్పీ ఉన్నత పాఠశాలలో 1980-81బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలిశారు. ఒకరినొకరు యోగక్షేమాలను అడిగితెలుసుకుంటూ నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కలిసిమెలసి ఆనందంగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులు నేర్పిన విద్యాబుద్ధులు గుర్తుకు తెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అనంతపద్మనాభం, అప్పటి ఉపాధ్యాయులు అశ్వత్థ నారాయణ, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు. మృతిచెందిన అప్పటి ఉపాధ్యా యులు, పూర్వవిద్యార్థుల కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు. చదువుకున్న పాఠశాల రూ.55 వేలు విలువ చేసే బహుమానం ఇవ్వాలని నిర్ణయించారు.



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

శ్రీవారికి హనుమద్వాహన సేవ



హనుమద్వాహనంపై విహరిస్తున్న స్వామి

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చే కొండమీద రాయుడు స్వామి హనుమద్వాహనంపై పురువీధులలో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు హనుమద్వాహ న సేవ ఆదివారం నేత్ర పర్వంగా సాగింది. ఉదయం స్థానిక అంజినేయ స్వామి దేవాలయంలో శ్రీదేవి, భూదేవి సమేత స్వామి ఉత్సవమూర్తులకు వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకిలో ఊరేగించారు. సాయంత్రం స్వామి హనుమద్వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణ మధ్య ఊరేగింపు వైభవంగా సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకుని కోర్కెలు కోరారు. బ్రహోత్సవాల్లో భాగంగా సోమవారం గరుడవాహన సేవ నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు.

నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

బుక్కరాయసముద్రం ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాల యంలో సోమవారం ఉదయం 9:30 గంటలకు మండల స్థాయి ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు టీడీపీ నేత పసుపుల శ్రీరామిరెడ్డి ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పాల్గొంటారన్నారు. రైతుల సమస్యలు, సంక్షేమ పథకాలు, భూ సమస్యలు తదితర వాటిపై వివిధ శాఖల అధికారులకు ప్రజలు ఇచ్చిన అర్జీలను పరిష్కరిస్తారని తెలిపారు. ఈ సమస్యలపై రైతులు, ప్రజలు వినతి పత్రాలు ఇవ్వవచ్చని ఆయన తెలిపారు.

వీసీల నియామకంలో ఎస్సీ, ఎస్టీలకు చోటివ్వాలి

- ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం నాయకులు



మాట్లాడుతున్న రవిశంకర్

అనంతపురం క్లాక్ టవర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీలకు వైస్ చాన్స్‌లర్ల నియామకంలో ఎస్సీ, ఎస్టీలకు తగు ప్రాతినిధ్యం కల్పించాలని ఆలిండియా ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎన్జీఓ హోంలో నిర్వహించిన సమావేశంలో ఆలిండియా ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమసంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ మాట్లాడుతూ...రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 26యూనివర్శిటీల వైస్ చాన్సలర్ల నియామకంలో ఎస్సీ ఎస్టీలకు ప్రాతినిధ్యం కల్పించేలా చూడాలన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీలు జనాభాలో 25శాతం ఉన్నారన్నారు. 25శాతం జనాభా ఉన్న ఎస్సీ ఎస్టీలకు 26యూనివర్శిటీలకు గాను కనీసం 6వైస్ చాన్సలర్లను నియమించి అవకాశం కల్పించాలన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 164ప్రకారం ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో ఎస్సీ ఎస్టీలకు తగిన ప్రాతినిధ్యం ఉండాలని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ ఎస్టీలకు గుర్తింపు ఇస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సమావేశం లో ఆ సంఘం నాయకులు శంకరప్ప, సుగప్ప తదితరులు పాల్గొన్నారు.

మిట్స్‌కు ట్రిపుల్ 'ఏ' ర్యాంకు



సర్టిఫికెట్లు, అవార్డులను ప్రదానం చేస్తున్న ఎన్‌పీటీఎల్ ప్రతినిధులు

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ అనుబంధ మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు జాతీయస్థాయిలో టాప్ -20 కళాశాలగా ట్రిపుల్-ఏ ర్యాంకు లభించినట్లు ఆదివారం కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ ప్రకటనలో తెలిపారు. స్వయం పోర్టల్ ద్వారా ఎన్‌పీటీఈఎల్ సర్టిఫికెట్స్ కోర్సులను ఏర్పాటుచేసి పరీక్షలు నిర్వహించారన్నారు. మిట్స్ కళాశాల నుంచి 7480మంది అధ్యాపకులు, విద్యార్థులు పరీక్షలు రాయగా 5734మంది ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. సర్టిపికెట్స్‌తోపాటు గోల్డ్, సిల్వర్, ఎలైట్ ర్యాంకులు ప్రదానం చేసినట్లు వివరించారు. జాతీయస్థాయిలో టాప్ - 12 కళాశాలగా, ట్రిపుల్ ఏ ర్యాంకుతో కూడిన అవార్డులను కళాశాల మెకానికల్ విభాగం ప్రొఫెసర్ పృధ్విరాజన్‌కు చైన్నై ఐఐటీలో అందజేశారని పేర్కొన్నారు. గుర్తింపు రావడానికి కృషిచేసిన అధ్యాపకులకు, విద్యార్థులకు కళాశాల కరస్పాండెంట్ విజయభాస్కర్ చౌదరి, ఈడీ కీర్తి నాదేండ్ల ప్రశంసించి అభినందించారని తెలిపారు.

ఆదమరిస్తే ప్రమాదమే



దెబ్బతిన్న తల్లిమడుగుల కల్వర్టు

కనగానపల్లి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని తల్లిమడుగుల గ్రామంలో కల్వర్టు ప్రమాదకరంగా తయారైంది. వర్షాకాలంలో రోడ్డు కుంగి కంకరతేలింది. అక్కడ ఎటువంటి ప్రమాద సూచికలు లేకపోవడంతో రాత్రివేళల్లో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ దారి గుండా కనగానపల్లి నుంచి రామగిరి మండలానికి ఆటోలు, ద్విచక్ర వాహనాలు. బస్సులు, బొలేరోలు ప్రతిరోజూ వెళుతుంటాయి. కల్వర్టు దెబ్బతినడంతో వర్షాకాలంలో వంక ప్రవహించి రాకపోకలు నిలిచి పోతాయని స్థానికులు వాపోతున్నారు. వంక పారినప్పుడు లోతు తెలియక అందులోకి దిగిన వాహనాలు కొట్టుకపోయిన సంఘటనలు ఉన్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కల్వర్టు నిర్మించాలని వారు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

శీర్పి చెరువుకు చేరిన కృష్ణాజలాలు



చెరువు వద్ద గంగపూజ చేస్తున్న రైతులు, టీడీపీ నాయకులు

బెళుగుప్ప, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా పథకం నుంచి కృష్ణా జలాలు మండలంలోని శీర్పి చెరువుకు ఆదివారం చేరాయి. దీంతో వెంకటాద్రిపల్లి, శీర్పి గ్రామాల రైతుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. అంకంపల్లి పంపుహౌస్ నుంచి శనివారం నీరు వదలడంతో ఆదివారం చెరువుకు చేరాయి. రైతులతో పాటు టీడీపీ నాయకులు సునీల్, పెద్ద యర్రిస్వామి, జయరాములు, శశిభూషణ్ తదితరులు చెరువు వద్దకు వెళ్లి గంగపూజ చేశారు. పలువురు మాట్లాడుతూ... మంత్రి పయ్యావుల కేశవ్ రైతులను ఆదుకోవడమే ధ్యేయంగా మండలంలోని రెండు చెరువులకు నీటి విడుదలకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారని హర్షం వ్యక్తం చేశారు. ఇక నుంచి బోర్లలో భూగర్భ జలాల సమస్య ఉండదని పేర్కొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరహాళ్ గ్రామ శివారులో పేకాట స్థావరంపై ఆదివారం దాడులు చేసి 13 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ నబీరసూల్ తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు చేసి పేకాటాడుతున్న వారిని అరెస్టు చేశామన్నారు. అలాగే వారి నుంచి రూ.8,430 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వీరిని రాయదుర్గం కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

గుత్తి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేంద్రీయ విద్యాలయం సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. కర్నూలు జిల్లా జొన్నగిరికి చెందిన రాజేష్, రాజు పని నిమిత్తం బైక్‌పై గుత్తికి వచ్చి తిరిగి వెళ్తుండగా.. కేంద్రీయ విద్యాలయం సమీపంలో వెనుక నుంచి ఆటో ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణను త్వరగా అమలు చేయాలి

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఏపీలో ఎస్సీ వర్గీకరణను త్వరగా అమలు చేయాలని ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ పేర్కొన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం ఆయన గుంతకల్లు నియోజకవర్గ మాదిగ ఉద్యోగుల సమాఖ్య సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఏర్పాటైన రాజీవ్ రంజన్ మిశ్రా ఏక సభ్య కమిషన్ వినేధికను త్వరగా ప్రభుత్వానికి అందజేయాలన్నారు. తెలంగాణలో మాదిగ ఉపకులాలకు 11శాతం రిజర్వేషన్ దక్కాల్సి ఉండగా 9శాతం ఇచ్చి అన్యాయం చేశారని అన్నారు. ఇలాంటి తారతమ్యాలు ఆంధ్రప్రదేశ్‌లో చోటు చేసుకోకుండా అన్ని ఉపకులాలకు జనాభా ప్రకారం వాటా ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు మన్నెసాకుల రమేష్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ జీ రామాంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి వై అశోక్‌కుమార్, ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

గంజికుంటలో గుండె వైద్యశిబిరం

ఉరవకొండ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం గంజిగుంట గ్రామంలో ఆదివారం మార్క్ ఆస్పత్రి, పయ్యావుల సోదరుల ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఇందులో 200 మందికి పలు పరీక్షలు చేసి 32 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు డాక్టర్ నాగరాజు తెలిపారు. అలాగే ఉరవకొండలో పట్టణంలోని విశ్రాంతి ఉద్యోగుల భవనంలో కర్నూలుకు చెందిన సుశీల నేత్రాలయం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం జరిగింది. ఇందులో 60 మందికి కంటి పరీక్షలు చేశారు.

విచారణ చేపట్టిన ఆర్డీఓ, ఏఎస్పీ

తాడిపత్రి, ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఓ మహిళ పట్ల వీఆర్వో అసభ్యంగా మాట్లాడాడని ప్రతికల్లో కథనాలు వచ్చిన నేపథ్యంలో ఆదివారం సదరు వీఆర్వోను, మహిళను ఆర్డీఓ కేశవనాయుడు, అడిషనల్ ఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి, తహసీల్దార్ రజాక్‌వలి విచారించారు. ఇరువురి అభిప్రాయాలను తీసుకుని నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని వారు పేర్కొన్నారు.

రేషన్ బియ్యం సీజ్



పట్టుబడిన రేషన్ బియ్యం

తాడిపత్రి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని గన్నెవారిపల్లె కాలనీలో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉన్నాయని సమాచారం అందడంతో శనివారం అర్ధరాత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి ఆధ్వర్యంలో రూరల్ సీఐ శివగంగాధరరెడ్డి, పట్టణ ఎస్ఐ గౌస్, సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ మారుతీ ప్రసాదరెడ్డి, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది కలిసి దాడులు నిర్వహించారు. ఇందులో వెంకటేసు, సముద్రుడు అనే వ్యక్తుల ఇళ్లల్లో నిల్వచేసిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వెంకటేసు ఇంట్లో 23 క్వింటాళ్లు, సముద్రుడు ఇంట్లో 18 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. ఆ బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. నిల్వచేసిన వారిపై కేసు నమోదు చేస్తామన్నారు.

పామిడిలో ఘర్షణ

● యువకుడిపై వేటకొడవలితో దాడి

పామిడి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నారాయణ స్వామి వీధి(సంతమార్కెట్)లో ఆదివారం రాత్రి ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. నారాయణ స్వామి వీధికి చెందిన ఓ యువకుడు తన స్నేహితురాలిని బస్టాండ్ వద్ద వదిలేందుకు వెళ్తుండగా.. అదే వీధికి చెందిన మరో యువకుడు అజయ్ కామెంట్ చేశాడు. దీంతో వారి మధ్య వాగ్వాదం జరిగింది. విషయం తెలుసుకున్న యువకుడి కుటుంబసభ్యులు రామాంజనేయులు మరికొందరు వచ్చి అజయ్‌పై కొడవలితో దాడి చేసి గాయపరిచారు. స్థానికులు వెంటనే క్షతగాత్రుడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. పాతకక్షలతోనే అజయ్‌పై దాడి చేశారంటూ అతడి కుటుంబ సభ్యులు, బంధువులు పోలీసు స్టేషన్ వద్దకు పెద్దఎత్తున చేరుకుని రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. పరిస్థితి విషమించకుండా గుత్తి సీఐ వెంకటేశ్వర్లు, పామిడి ఎస్ఐ రాంప్రసాద్, సిబ్బందితో తగు చర్యలు చేపట్టారు.



పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న బాధితుడి బంధువులు

భక్తుల కొంగుబంగారం..

● నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

విప్రమలై లక్ష్మీనారసింహుడు



స్వామి వారి ఆలయం



లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్

రాయదుర్గం రూరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం తాలూకా మల్లాపురం గ్రామ పంచాయతీలో వెలసిన విప్రమలై లక్ష్మీనరసింహస్వామి వారు కొలిచిన భక్తులకు కొంగు బంగారంగా విరాజిల్లుతున్నారు. ఈ స్వామి ఆలయాన్ని విజయనగర రాజు శ్రీకృష్ణదేవరాయులు నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. హంపీలో పరిపాలన సాగించేటప్పుడు శ్రీకృష్ణదేవరాయలు సామ్రాజ్య విస్తరణలో భాగంగా పెనుకొండ సంస్థానానికి వచ్చిన సమయంలో అనంతపురం జిల్లాలో పలు వైష్ణవ ఆలయాలను నిర్మించారని, ఆ సమయంలోనే మల్లాపురం గ్రామ సమీపంలో విప్రమలై లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని నిర్మించినట్లు ఆలయకమిటీ గౌరవ అధ్యక్షుడు రామ్మూర్తిస్వామీజీ తెలిపారు. గతంలో ఆలయం పూర్తిగా అడవిలో ఉండటం వల్ల అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో రాయదుర్గం పట్టణానికి చెందిన రామ్మూర్తిస్వామీజీ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసి ఆయల జీర్ణోద్ధారణ పనులు చేపట్టారు. అలాగే ఆలయంలో స్వామి వారి నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. భక్తుల విరాళాలతో ఆలయ జీర్ణోద్ధారణ పనులు వేగంగా జరిగాయి.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు



ప్రతి యేడాది లాగే ఈ సారి కూడా స్వామి వారి 29వ బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నాం. అందులో భాగంగా ఈ నెల 10వ తేదీన ధ్వజారోహణం, 11న స్వామివారికి కల్యాణోత్సవం, మాలాధారణ, 12న బ్రహ్మరథోత్సవాన్ని అశేష భక్తజనం మధ్యన జరపనున్నాం.

-రామ్మూర్తి స్వామీజీ, ఆలయకమిటీ గౌరవాధ్యక్షుడు

ఏటా మాఘపౌర్ణమికి బ్రహ్మోత్సవాలు

ప్రతి సంవత్సరం మాఘమాసం పౌర్ణమి రోజున ఇక్కడ స్వామి వారి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మూడురోజుల పాటు ఈఉత్సవాలను జరుపుతారు. మూడో రో జు నిర్వహించే స్వామివారి బ్రహ్మరథోత్సవానికి వేలాదిగా భక్తులు తరలివస్తారు.

శ్రావణమాసంలో ప్రత్యేక పూజలు

ప్రతి సంవత్సరం శ్రావణమాస శనివారాలలో లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేకపూజలు నిర్వహిస్తారు. పల్లకిసేవ, గరుడవాహనం, ఉచిత అన్నదాన కార్యక్రమాలను ఆలయ కమిటీ వారు చేపడతారు. దీంతో పాటు సుబ్రహ్మణ్య షష్ఠి, నరసింహుడి జయంతి కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా కాలవ శ్రీనివాసులు ఎంపీగా ఉన్న సమయంలో ఆలయానికి విద్యుత్ సౌకర్యం, మంత్రి గా ఉన్న సమయంలో తేరు లాగుటకు సిమెంట్‌రోడ్డును ఏర్పాటు చేయించారు. ప్రస్తుతం కల్యాణమంటపం నిర్మాణదశలో ఉంది.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



రాయదుర్గంలో పూర్వ విద్యార్థుల గ్రూప్ ఫొటో

యాడికి, ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి): యాడికి హైస్కూల్‌లో 2002-2003 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 23 ఏళ్ల తర్వాత అందరూ అదే పాఠశాలలో కలిశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు భాస్కర్‌రెడ్డి, నూర్‌మహ్మద్, నాగరాజుశర్మ, మహబూబ్‌బాషా, నరసింహారెడ్డి, గురుమూర్తి, జనార్దన్, చంద్ర, లీలావతి తదితరులను ఘనంగా సన్మానించారు. పూర్వవిద్యార్థులు సూర్యనారాయణ, సందీప్, వెంకటకుమార్, శ్రీరంగ, రాఘవేంద్ర, రామాంజనేయులురెడ్డి, ఎస్‌కే బాషా తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం: పట్టణంలోని కళ్లీమఠం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 1996-2001 విద్యాసంవత్సరాల్లో చదువునభ్యసించిన విద్యార్థులు గెట్‌టుగెదర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆప్యాయంగా పలకరించుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తర్వాత అప్పటి ఉపాధ్యాయులు శంకరప్ప, శ్రీరాములు, రామాంజినేయులు, అంజినప్ప, హెచ్‌కే బాష, సుధాకర్, ప్రహ్లాద, రమేష్, రాములను సన్మానించారు.





యాడికిలో నాటి ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు, (పురుషులు, మహిళలు వేర్వేరుగా ఉన్న దృశ్యం)

నేరేడు మొక్కలు, మామిడి చెట్లకు నిప్పు

రాయదుర్గంరూరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవులదట్లలోని రైతు చిక్కణ్ణ తోటలో నేరేడు మొక్కలు, మామిడి చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతోనే తోటలోని ఆరునెలల 170 నేరేడు మొక్కలు, 15 మామిడి చెట్లు, ఒకటిన్నర ఎకరాలోని మల్బరీ మొక్కలు, డ్రిప్ పైపులు కాలిపోయినట్లు బాధితుడు వాపోయారు. సమాచారం అందుకున్న అగ్నిమాపకసిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో రూ.2లక్షలు నష్టం వాటిల్లినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఘనంగా పాండురంగ స్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తజనం

కణేకల్లు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని గెణిగెర గ్రామంలో రుక్మిణీ పాండురంగస్వామి రథోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉదయమే ఆలయంలో మూలవిరాట్‌కు పలు అభిషేకాలు, అర్చనలు చేసి విశేష పూజలు జరిపారు. అనంతరం సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన తేరులో స్వామిఉత్సవ విగ్రహాన్ని ఉంచి అశేష భక్తజనం మధ్య లాగారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, ఆలయ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు





బీరప్పస్వామి ఆలయం, తవ్వకాలు చేపట్టిన ప్రదేశం

డీ.హీరేహాళ్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓ పురాతన ఆలయంలో శనివారం రాత్రి కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు గుప్తనిధుల కోసం తవ్వకాలు జరపడం కలకలం రేగింది. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పురాతన బీరప్ప స్వామి ఆలయం ఊరి బయట ఉండడంతో భక్తుల రాకపోకలు తక్కువగా ఉంటుంది. ఇది గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు శనివారం అర్ధరాత్రి సమయంలో ఆలయంలోకి చొరబడి ఆలయ గర్భగుడిలో విగ్రహం వద్ద తవ్వకాలు చేపట్టారు. అక్కడ ఉన్న మల్లమ్మ విగ్రహాన్ని కదిలించి తవ్వకాలు చేపట్టారు. తవ్వకాల అనంతరం విగ్రహాన్ని, బండలను యథావిధిగా సరి చేసి వెళ్లిపోయారు. ఆదివారం ఉదయం అటు వైపు వెళ్లిన కొందరు గ్రామస్థులు అక్కడ ఆలయంలో చెల్లాచెదురుగా పడిన మట్టిని రాళ్లను గమనించారు. వెంటనే సమాచారం అందించగా పెద్దఎత్తున గ్రామస్థులు అక్కడికి పరిశీలించారు. గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిగినట్లు అనుమానించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. దీనిపై విచారణ చేపట్టి బాధ్యులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు

కణేకల్లు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయఢంకా మోగించడంతో మండలకేంద్రంలోని ఆ పార్టీ శ్రేణులు ఆదివారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పురవీధుల్లో బైక్‌ర్యాలీ చేపట్టి టపాసులు కాల్చారు. అనంతరం చిక్కణ్ణేశ్వర ఆలయం వద్ద కేక్ కట్ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు తిప్పేస్వామి, నాయకులు హీరోజీరావు, మల్లారెడ్డి, మల్లయ్యచౌదరి, చిక్కణ్ణ, గో పాల్‌రావు, రవి, నాగభూషణం, ఎర్రిస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు మోడల్ టెస్ట్

రాయదుర్గం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులలో పబ్లిక్ పరీక్షలపై భయం పోగొట్టడానికిగాను పట్టణంలోని మోడల్ స్కూల్లో ఆదివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మోడల్‌టెస్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశ్నపత్రాలను ఎంఈఓ వెంకటరమేష్‌తో పాటు ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షుడు ఆవుల మనోహర్ విడుదల చేశారు. సుమారు 500 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరై రాశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఎంఎల్ శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త ఆకస్మిక మృతి



కోనంకి మహేష్ (ఫైల్)

బెళుగుప్ప, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో తగ్గుపర్తి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కోనంకి మహేష్ (25) ఆదివారం అనారోగ్యంతో ఆకస్మికంగా మృతి చెందారు. కొద్దిరోజుల క్రితం వరకూ కూడా అతను పల్లె పల్లె తిరిగి టీడీపీ సభ్యత్వ నమోదులో చురుగ్గా పాల్గొన్నారు. అయితే నరాల వ్యాధితో బాధపడుతున్న ఈయన అకస్మాత్తుగా మృతి చెందారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు రఘురాములు, వెంకటలక్ష్మీ తమకు దిక్కెవరంటూ కన్నీరుమున్నీరుగా విలపించారు. టీడీపీ నాయకులు వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

869 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఆదివారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 904 క్యూసెక్కులున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 460 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

అడవులు బుగ్గి..

- కాలి బూడిదవుతున్న అటవీ సంపద
- తినడానికి ఏమీ దొరక్క సమీప పొలాల్లోకి వస్తున్న వన్యప్రాణులు
- పట్టించుకోని అధికారులు



శెట్టూరు అడవిలో కాలిపోతున్న ఎండుగడ్డి (ఫైల్)

శెట్టూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవులు ఇటీవల వరుసగా అగ్నికి ఆహుతవుతున్నాయి. దీంతో చెట్లు, మొక్కలు, గ్రాసం తదితర అటవీ సంపద మొత్తం కాలి బూడిదవుతున్నాయి. మంటలు తాళలేక వన్యప్రాణులైన జింకలు, అడవి పందులు, ఎలుగుబంట్లు సమీప పంటపొలాల్లోకి చేరుకుంటున్నాయి. అవి పంటలను నాశనం చేస్తూ రైతులను ఇబ్బందుల పాల్జేస్తున్నాయి. అడవులు కాలిపోతుండడంతో గ్రాసం దొరక్క ఆ వన్యప్రాణులు పొలాల వైపు వస్తున్నాయని సమీప గ్రామాల ప్రజలు అంటున్నారు. ఇదిలా ఉండగా.. అడవిలో మొక్కలు, గ్రాసం దగ్ధమవుతుండడంతో సమీప గ్రామాల పాడిపశువుల యజమానులు, గొర్రెల కాపరులు చింతిస్తున్నారు. పశువులు, గొర్రెలు, మేకలు ఎక్కువగా అడవిలోని కొండల్లో దొరికే గ్రాసంపైనే ఆధారపడి వుంటాయి. రైతులు, కాపరులు నిత్యం వాటిని అక్కడికే మేతకు తోలుకెళ్తుంటారు. ప్రస్తుతం అటవీ సంపద కాలిపోతుండడంతో పశుగ్రాసం కొరత ఏర్పడుతోందని వారు ఆవేదన చెందుతున్నారు. అడవులు వరుసగా కలిపోతున్నా... అటవీశాఖ అధికారులు ఏమీ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఈ నిర్లక్ష్యానికి కారణం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

హనుమంత వాహనంపై ఊరేగిన రంగనాథుడు



హనుమంత వాహనంపై స్వామివారు

గుత్తిరూరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండపాడులో బొలికొండ రంగనాథస్వా మి బ్రహ్మోత్సవాల్లో భా గంగా ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వా మి వారు హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు వేకువజామునే ఆలయం లో స్వామివారికి పలు అభిషేకాలు, అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాత్రి సమయంలో ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి హనుమంత వాహనంపై కొలువు దీర్చి మేళతాళాల నడుమ గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం పల్లకిలో కొలువుదీర్చి సమీపంలోని జమ్మిచెట్టు వరకు ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ఈఓ రామాంజనేయులు, ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ రంగస్వామిరెడ్డి యాదవ్, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సేవాలాల్ జయంత్యుత్సవాల పోస్టర్ల విడుదల



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జయరాం

గుత్తిరూరల్/ పామిడి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని సేవాఘడ్‌లో వెలసిన సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాల పోస్టర్లను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కర్నూలు జిల్లా ఆలూరులో ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు జరిగే ఉత్సవాలకు వేలాదిగా భక్తులు హాజరవుతారని, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఏపీడీటీడబ్ల్యూఓ రామాంజనేయులుకు, ఏపీ రాష్ట్ర గిరిజన సహకార సంస్థ డైరెక్టర్ రమేష్‌నాయక్‌కు సూచించారు. సింగిల్ విండో మాజీ డైరెక్టర్ మల్లికార్జున నాయక్, గుండాల తండా ఫీల్డ్ అసిస్టెంట్ ప్రకాష్ నాయక్, ఆలయ కమిటీ సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు.

కైరేవులో మళ్లీ చిరుత సంచారం

● భయాందోళనలో స్థానికులు

శెట్టూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కైరేవు గ్రామం లో గత శుక్రవారం చిరుత దాడిలో ఆవు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషయం మరవకముందే ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో మళ్లీ అదే గ్రామంలోని శెట్టూరు రోడ్డులో నవగ్రహాలు కలిగి వున్న ప్రాంతంలో చిరుత సంచరించింది. దీంతో అక్కడి ప్రజలు భయాందోళనకు గురై ఊళ్లోకి పరుగులు తీశారు. అటవీశాఖ అధికారులు ఈ పరిసరాలలో సంచరిస్తున్న చిరుతను అదుపులోకి తీసుకుని మమ్మల్ని రక్షించాలని గ్రామస్థులు కోరుతున్నారు. శెట్టూరుకి పోయే ప్రయాణికులు కూడా చీకటి ప్రాంతంలో జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచించారు.

నిరుపేదలకు ఇళ్లస్థలాలు కేటాయించాలి

తాడిపత్రి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నిరుపేదలకు ప్రభుత్వం ఇళ్లస్థలాలు కేటాయించాలని సీపీఐ నాయకులు రంగయ్య, చిరంజీవియాదవ్ కోరారు. పట్టణంలోని గాంధీకట్ట, సీపీఐకాలనీల్లో ఆదివారం వారు ఇళ్ల స్థలాల కోసం పేదల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల ఇళ్ల స్థలాలను కేటాయించాలన్నారు. ఇంటి నిర్మాణానికి ఇసుక, ఇనుము, ఇటుక, కంకర వంటి వాటిని కూడా ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిర్మాణానికి మరో రూ.5లక్షలు ఇవ్వాలని కోరారు. నాయకులు శ్రీరాములు, రామాంజి, నాగేంద్ర, రత్నమయ్య, అబ్రహం, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

చెరువు దారికి మరమ్మతులు



దారికి మరమ్మతులు చేస్తున్న దృశ్యం

కుందుర్పి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మండ్లీ చెరువు అభివృద్ధికి ఆదివారం శ్రీకారం చుట్టారు. ఎన్నో యేళ్లుగా చెరువుకు వెళ్లే దారి గుంతలు పడి, చుట్టూ కంపచెట్లు పెరిగి అధ్వానంగా ఉండడంతో రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందిగా ఉండేది. కాగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సహకారంతో సాగునీటి సంఘం అధ్యక్షుడు రామ్మూర్తి, ఉపాధ్యక్షుడు లోకేశప్ప, డైరెక్టర్లు, స్థానిక టీడీపీ నాయకులు కలిసి అధ్వానంగా ఉన్న రెండు కిలో మీటర్ల దారికి మరమ్మతులు చేపట్టారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో ప్రతిభ



విడపనకల్లు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని గడేకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీడీగా పని చేస్తున్న అయూబ్ ఖాన్ రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలో ప్రథమ బహుమతి సాధించారు. అనంతపురంలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్ పోటీలో ఆయన పాల్గొని 800 మీటర్స్‌లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి ప్రథమ బహుమతి పొందారు. ఇందుకు ఆయన్న గడేకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థిని చదువుకు ఆర్థికసాయం

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఓ నిరుపేద విద్యార్థినికి కళాశాల ఫీజు కోసం ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ బద్దేనాయక్ ఆర్థికసాయం అందచేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. శెట్టూరు మండలం చెర్లోపల్లికి చెందిన ఈడిగ రమేష్, ఈడిగ తిమ్మక్క దంపతులు కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి కుమార్తె ఈడిగ జ్యోతి గుత్తి గేట్స్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కాగా కళాశాల ఫీజు కట్టలేకపోవడంతో ఆమె ఇంటివద్దనే ఉంటోంది. విషయాన్ని తెలుసుకున్న బద్దేనాయక్ కళ్యాణదుర్గం పట్టణంలోని తమ ట్రస్ట్ కార్యాలయంలో ఆదివారం ఆ విద్యార్థిని తల్లిదండ్రులకు రూ. 30 వేలు ఆర్థికసాయాన్ని బుల్లితెర హాస్యనటుల చేతుల మీదుగా అందించారు. ట్రస్ట్ వైస్ ఛైర్మన్ సురేష్ కుమార్, కోశాధికారి అబ్దుల్ వాహబ్, కార్యదర్శి హరీష్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న బద్దేనాయక్, బుల్లితెర హాస్యనటులు